సీఎం కేసీఆర్‌ను కలిసిన బండారు లక్ష్మారెడ్డి



కాప్రా: సీఎం కేసీఆర్‌ను ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారు లక్ష్మారెడ్డి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించినట్లు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మౌలాలి: డివిజన్ సుధానగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం బీజేపీ మల్కాజిగిరి సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ పరిశీలించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాయక్, కాలనీవాసులు శ్రీనివాస్, అశోక్, సుజాత, భిక్షపతి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మరాఠా కులస్తుల అభివృద్ధికి కృషి



బోర్‌వెల్ భూమిపూజలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఉప్పల్: మరాఠా కులస్తుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో మరాఠా కులస్తులకు ఆత్మగౌరవ భవనం కేటాయించిన స్థలంలో బోర్‌వెల్, భూమిపూజకు మంగళవారం ఆయన హాజరయ్యారు. మరాఠా కులస్తులు నివాస్, ఎల్కేషిండే, నివాస్‌నిక్కం, మదన్ జాదేవ్, దిలీప్, హరీష్ కోనాలే, అశోక్, సతీవన్, బీఆర్ఎస్ నేతలు జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి, చింతల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆసరా



కుట్టుమిషన్ అందజేస్తున్న సుఖినోభవంతు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రత్నప్రభ

కాప్రా: కాప్రా సాయిబాబానగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన షాహెనా బేగంకు సుఖినోభవంతు ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకురాలు రత్నప్రభ చేతులమీదుగా మంగళవారం పీకో ఫాల్స్, కుట్టుమిషన్‌ను అందజేశారు. విజయ, అనిత, హరిణి, అనిల్, ప్రవీణ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామాగ్రి పంపిణీ



విద్యార్థులకు క్రీడాసామాగ్రి అందజేస్తూ..

కాప్రా: దివంగత మణిపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్ లయన్ పావనీమణిపాల్‌రెడ్డి కమలానగర్ స్ఫూర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి చేతులమీదుగా సిద్దిపేట వెచరేణి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్స్, షూస్, సాక్స్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకట్‌నారాయణరెడ్డి, నాయకులు కళ్లెం కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, కమలానగర్ స్ఫూర్తి అధ్యక్షులు రూపారెడ్డి, కాలనీవాసులు రాజు, హరినాథ్, వంజరి ప్రవీణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠకు సాయం



రామంతాపూర్: రాజేంద్రనగర్‌లో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా ఆలయంలో బాబా విగ్రహాన్ని కొనుగోలు చేసి ప్రతిష్ఠించేందుకు రూ.1.35 లక్షలను మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్నానాగేశ్వర్‌రావు మంగళవారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

ప్రయత్నం చేస్తేనే లక్ష్యం సాధ్యం



న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ ముత్యంరెడ్డి

అల్వాల్: అల్వాల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాలిక సాధికారిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ లక్ష్యం ఏర్పర్చుకోవాలని, ఆ దిశగా ప్రయత్నం చేస్తూనే ఉండాలన్నారు. కుమిలిపోవడం, ఏడవడం మరిచిపోవాలన్నారు. ఉన్నత చదువు చదివితే ఆర్థిక స్వాలంభన లభిస్తుందని, న్యాయశాఖలోని వివిధ విభాగాలు, వాటి సేవలను తెలియజేశారు. కేసు విషయంలో జరిగే అంశాలను దశలవారీగా వివరించారు. టెక్నాలజీ ఆధారంగా అభివృద్ధికి అడుగులు వేయాలని సూచించారు. అదనపు మెట్రోపాలిటన్ సెకండ్ సీనియర్ మెజిస్ట్రేట్ దిలీప్‌కుమార్ నాయక్, పాఠశాల ప్రిన్సిపల్ సంధ్య, అల్వాల్ ఎస్ఐ సురేష్, జేఏసీ నాయకులు నాగమయ్య, మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సభ్యులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవితను కాపాడుదాం

మల్లాపూర్: బాలికల ఉజ్వల భవితను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అడిషనల్ ఎస్పీ ముత్యంరెడ్డి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ విజ్ఞాన భారతి హైస్కూల్, శ్రీచైతన్య స్కూల్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని అడిషనల్ ఎస్పీ ముత్యంరెడ్డి జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. ఆడపిల్ల అంటే ప్రస్తుత సమాజంలో చిన్న చూపు చూస్తున్నారని, అలాకాకుండా బాలికల సంరక్షణకు పాటుపడాలని పేర్కొన్నారు. ఆడపిల్లలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మల్లాపూర్ వెంకటరమణ కాలనీ నుంచి మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ నుంచి పాఠశాల వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విజ్ఞాన భారతి హైస్కూల్ కరస్పాండెంట్ పెద్దింటి బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భేటీ పడావో.. భేటీ బచావో..

రామంతాపూర్: వెంకటరెడ్డినగర్‌లోని శ్రీసాయిరాం హైస్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. బేటీ పడావో.. బేటీ బచావో నినాదాలతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ కరెస్పాండెంట్ బుచ్చిరెడ్డి, ప్రిన్సిపల్ మానసారెడ్డి, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

గౌతంనగర్: విద్యార్థులకు చదువుతోపాటు ఆటల పోటీలు దోహదపడతాయని సుబేదార్ ఖాజాపాషా(జేసీఓ) అన్నారు. మల్కాజిగిరి భాష్యం పాఠశాలలో స్పోర్ట్స్ డేని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భాష్యం విద్యాసంస్థలకు చెందిన ఏడు బ్రాంచ్‌ల విద్యార్థులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఖాజాపాష మాట్లాడుతూ పిల్లలకు మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం చాలా అవసరం అన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి మార్కండేయులు, మల్కాజిగిరి బ్రాంచ్ ప్రిన్సిపల్ కోమలి పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మల్కాజిగిరి భాష్యం పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఖాజాపాషా


బీజేపీ బీసీ చైతన్య యాత్రకు స్పందన



మచ్చబొల్లారం డివిజన్‌లో బీసీ చైతన్య యాత్రలో బీజేపీ నాయకులు

అల్వాల్: బీజేపీ ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ బీసీ చైతన్య యాత్ర రెండో రోజు మచ్చబొల్లారం డివిజన్ తుర్కపల్లి గ్రామం, బర్టన్‌గూడ, బంధం బస్తీ, లక్ష్మమ్మ ఎన్‌క్లేవ్ పోలింగ్ బూత్ నంబర్లు 369 పరిధిలోని బస్తీలు, కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లెల రవియాదవ్ మాట్లాడుతూ బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ చేపట్టిన జనచైతన్య యాత్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్రలను స్ఫూర్తిగా తీసుకొని బీసీ చైతన్య యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఈ యాత్రకు ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు చీదరించుకుంటున్నట్లు చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తమ జీవితాలు బాగుపడతాయని కేసీఆర్‌కు ఓట్లు వేశామని, కానీ డిగ్రీలు, పీజీలు చదివిన తమ పిల్లలు ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీలు కేసీఆర్ హామీలు ఇచ్చారని, తమ పిల్లలు చదువుకున్నా ఉద్యోగాలు రాలేదన్నారు. నాయీ బ్రాహ్మణులు, రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. బీసీ కార్పొరేషన్ నుంచి నిధులు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. స్థానిక సమస్యలు పట్టించుకునే నాథుడే లేడన్నారు. సమస్యల సుడిగుండంలో మచ్చబొల్లారం డివిజన్ ఉందన్నారు. తుర్కపల్లి గ్రామంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేసేందుకు శ్మశానవాటిక లేదని తెలిపారు. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్కువగా రైల్వే లైన్లు, డిఫెన్స్ ప్రాంతం ఎక్కువ ఉందని, చాలా సమస్యలు పరిష్కారం కావాలంటే కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. బీజేపీ నాయకులు దండుగు వెంకటేష్, మంగేష్, ఉమామహేశ్వరీ, గోపాలకృష్ణ, భాస్కర్, తాళ్ల వినయ్, కరుణశ్రీచ మాచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఏండ్ల భాస్కర్, నవీన్, రుద్రరాజ్, నాగరాజు, మహేష్, ఈగ లావణ్య, సుజాత, మల్లికార్జున్‌గౌడ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించాలి



జలమండలి అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: పలు కాలనీల్లో పొంగి పొరుతున్న డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు జలమండలి అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి సూచించారు. మల్లాపూర్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కార్యాలయంలో జలమండలి అధికారులతో కలిసి డ్రైనేజీ, తాగునీటి సరఫరాపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యపై నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్లు, తాగునీటి పైప్‌లైన్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జలమండలి జీఎం సంతోష్, డిప్యూటీ జీఎం సతీష్, మేనేజర్ సందీప్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు



కుషాయిగూడ: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులతో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్ఓటీ పోలీసుల వివరాల ప్రకారం.. కుషాయిగూడ, సాయినగర్ కాలనీకి చెందిన చౌటాల విజయ్(23), ఈశ్వర్(19) అనే ఇద్దరు యువకులు కొన్ని రోజులుగా గంజాయి విక్రయిస్తున్నారు. మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు సోమవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న విజయ్, ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన పి.విజయ్(21), పిల్లి ప్రవీణ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కుషాయిగూడ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. గంజాయి సేవించే విజయ్, ఈశ్వర్ అరకు నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



రామంతాపూర్‌లో ఏబీవీపీ కార్యకర్తల నిరసన

రామంతాపూర్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రామంతాపూర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన రహదారిపై మానవహారం చేస్తూ నిరసన చేపట్టారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర అఖిల్, నగర కార్యదర్శి వినయ్, నగర సంయుక్త కార్యదర్శి వినయ్, భాను పాల్గొన్నారు.

కంటి వెలుగు పరీక్షలపై ఆరా



ఉప్పల్: చిలుకానగర్ బ్యాంక్ కాలనీలోని కంటి వెలుగు కేంద్రాన్ని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మంగళవారం పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఉప్పల్ డీసీ అరుణకుమారి, ఏఎంసీ శైలజ, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమాదేవి, బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, రామానుజం, శ్యామ్, బాలు తదితరులు ఉన్నారు.

గొయ్యిలో పడి వ్యక్తి మృతి



అల్బర్ట్(ఫైల్)

మల్కాజిగిరి: గొయ్యిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. న్యూమీర్జాలగూడకు చెందిన అల్బర్ట్(45) సోదరి వద్ద ఉంటున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మీర్జాలగూడ ప్రాంతంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రాంతంలో ఉన్న గొయ్యిలో అల్బర్ట్ మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉండవచ్చని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఏడుకొండలు(ఫైల్)

మేడిపల్లి: ఓ వ్యకి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం బోడుప్పల్ లక్ష్మినగర్ కాలనీవాసి కె.ఏడుకొండలు(45) తాపీమేస్త్రి. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు తదితరులు

మల్కాజిగిరి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శవంతంగా ఉన్నాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. ఆనంద్‌బాగ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో ఎంపికైన 105 మందికి, కులాంతర వివాహం చేసుకున్న ఆరుగురికి, సీఎం రిలీఫ్ ఫండ్ అవసరమైన 30 మందికి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల ఆరోగ్యంతో పాటు, ఆర్థిక భద్రత కోసం సీఎం కేసీఆర్ ఆలోచించి కేసీఆర్ కిట్‌తో పాటు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అందజేస్తున్నారన్నారు. అనేక పథకాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి తాహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ వినీత, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీతాయాదవ్, రాజ్యలక్ష్మి, విజయశాంతిరెడ్డి, మీనారెడ్డి, జితేంద్రనాథ్, నాయకులు పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, జగదీష్‌గౌడ్, రాముయాదవ్ తదితరులు ఉన్నారు.

దళితుల జీవితాల్లో వెలుగులు



సిమెంట్ బ్రిక్స్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్‌కు చెందిన దళితబంధు లబ్ధిదారులు కడియాల సునీత, కేవీఎల్ఎన్ రావుల గోల్డ్‌స్టోన్ సిమెంట్ బ్రిక్ కాంక్రీట్ యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితబంధుతో లబ్ధి పొందిన వారంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. అర్హులైన వారందరికీ దళితబంధు అందేలా చూస్తానన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, ఎస్ఐ సాయికుమార్, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గిరిబాబు, జౌండ్ల వేణుగోపాల్‌రెడ్డి, గంప కృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరణ

మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ ఫేజ్-2 సంక్షేమ సంఘం కేలండర్‌ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్, బాలరాజు, ఈశ్వర్, వెంకటచారి, నాయుడు, జగదీష్, వెంకటేష్, సురేష్, భువనచంద్ర, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కు ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 16వ డివిజన్ పరిధిలోని బీఎల్‌నగర్‌లో రూ.4.5 లక్షలతో పార్కు స్థలం ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు మీసాల కృష్ణ, మోతే రాజు, కాలనీవాసులు మధు, తోట తిరుపతి, నాగులు, భాస్కర్, మురళి పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

వీఎన్‌రెడ్డినగర్ కాలనీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి




కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వి.లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షులుగా రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వాసుదేవరెడ్డి, రామచంద్రయ్య, రంగారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా హనుమంతరెడ్డి, కిషోర్, సూర్యభార్గవ, బాలరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బుచ్చిరెడ్డి, వరప్రసాద్, బాల్‌రెడ్డి, లక్ష్మణ్ సింగ్, కోశాధికారిగా రమేష్‌చౌదరి, అడ్వైజర్‌లుగా రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు



జ్యోతి ప్రజ్వలనలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యలను పరిష్కరించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ కాలనీలోని జీజీ గార్డెన్స్‌లో మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ డైరీని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేసేలా ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తుందన్నారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం స్థానిక నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులకు అండగా ఉంటా

మల్కాజిగిరి: నియోజకవర్గంలోని జర్నలిస్టులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. ఆనంద్‌బాగ్‌లోని క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి సర్కిల్ జర్నలిస్ట్ సంఘాల నాయకులు, రిపోర్టర్లు ఎమ్మెల్యేను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్, ప్రెస్‌క్లబ్‌కు భవనం, సంక్షేమ నిధి, ఇండ్ల స్థలాలు లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం అందజేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని, సీఎం ఇటీవల ఖమ్మంలో ప్రకటించిన విధంగా నియోజకవర్గంలో జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. టీయూడబ్ల్యూజే 143 యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విల్సన్, గిరిగౌడ్, టీయూడబ్ల్యూజే ఐజేయూ యూనియన్ అధ్యక్షుడు బాలాజీ, జిల్లా నాయకులు బాలరాజు, వెంకటేష్, మీడియా కన్వీనర్ నిరంజన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.